విశాలాంధ్ర కృష్ణా జిల్లా

కళారంగంలో గుడివాడ ఖ్యాతి కొనసాగించేలా కృషి చేయాలి

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక ఎస్‌పిఎస్ ఉన్నత పాఠశాలలో కృష్ణా ఆర్ట్ కల్చరల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాటిక పోటీలను ఆదివారం కెడిసిసి బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావుతో కలసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ప్రారంభించారు. ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ కలలకు పుట్టినిల్లయిన గుడివాడలో కళాకారులను ప్రోత్సహించేలా, జాతీయస్థాయి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కళారంగంలో గుడివాడకు ఎంతో ప్రత్యేక స్థానం ఉందని, ఆ ఖ్యాతిని కొనసాగేలా సాంస్కృతిక సంస్థలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను, కృష్ణా ఆర్ట్ కల్చరల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, సమన్వయకర్త ఆర్.వి.ఎల్ నరసింహారావు, పలు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

స్పష్టమైన ప్రకటన ఇవ్వకుంటే ఆందోళన తప్పదు: బుద్ధప్రసాద్

విశాలాంధ్ర-మోపిదేవి : అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ డిమాండ్ చేశారు. మోపిదేవి మండలంలో అకాల వర్షాల వల్ల దెబ్బ తిన్న వాణిజ్య పంటలను పరిశీలించారు. మెట్ట రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రైతు నేడు తీవ్ర సంక్షోభంలో ఉన్నాడని ఖరీఫ్ లో వరి పండించిన రైతు పండించిన పంట అమ్ముకునేందుకు ఎన్ని కష్టాలు పడ్డాడో అందరం చూసామని, నాడు తెలుగుదేశం పార్టీ పోరాడిన అనంతరమే రైతు నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభించిందని అనంతరం సాంకేతిక కారణాలు చెప్పి ఆఫ్లైన్లో మిల్లులకు దాన్యం తోలించిన ప్రభుత్వం నేడు ఆఫ్లైన్లో తోలిన ధాన్యానికి ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని పక్కకు తప్పుకోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. రేపటిలోగా రైతాంగ సమస్యలపై స్పష్టమైన ప్రకటన రాకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు సోమవారం ఉదయం మోపిదేవిలో రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టనున్నామని ఇది రైతుల పక్షాన తెలుగుదేశం పార్టీ చేపట్టనున్న పోరాటానికి నాంది అని వెంటనే రైతులు ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించేందుకు స్పష్టమైన హామీ ఇస్తూ ప్రభుత్వం నుంచి ప్రకటన రాకుంటే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని బుద్ధ ప్రసాద్ హెచ్చరించారు.

చేబ్రోలు ద్వితీయ వర్ధంతి

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో చిన ముత్తేవి గ్రామంలో శనివారం రాత్రి సీపీఎం నాయకులు చేబ్రోలు భాస్కరరావు ద్వితీయ వర్ధంతి నిర్వహించారు. పార్టీ కోసం అహర్నిశలు పాటుపడుతూ చివరి వరకు పేద వర్గాల పక్షాన పోరాడి బడుగు బలహీన వర్గాలకు అండదండలుగానున్న భాస్కర రావు సేవలు స్ఫూర్తిదాయక మని వక్తలు కొనియాడారు. పామర్రు, దివి డివిజన్లో అనేక పోరాటాలు సాగించి రిక్షా కార్మికుల, ముఠా కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించారని ఆయన సేవలను మననంచేసుకున్నారు. సీనియర్ నాయకులు మద్దుల బసవరావు అధ్యక్షతన సాగిన కార్యక్రమంలో సీపీఐ పామర్రు నియోజకవర్గ కార్యదర్శి దగాని సంగీతరావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.రఘు, జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు, భాస్కరరావు భార్య చేబ్రోలు బసవపూర్ణ తదితరులు పాల్గొన్నారు. తొలుత భాస్కరరావు అమర స్తూపం వద్ద నివాళులర్పించారు.

సమన్వయంతో పనిచేయాలి

జిల్లాలో సీఎం పర్యటన విజయవంతం చేయాలి : జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆర్కె రోజా

విశాలాంధ్ర-మచిలీపట్నం : కృష్ణాజిల్లాలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19వ తేదీ గుడివాడ, 22వ తేదీ మచిలీపట్నంలో జరిపే రెండు ముఖ్యమైన కార్యక్రమాలను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక యువజన అభ్యుదయ శాఖ, కృష్ణాజిల్లా ఇన్చార్జ్ మంత్రి ఆర్కే రోజా సూచించారు. ఆదివారం ఆమె మచిలీపట్నంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), గుడివాడ ఎమ్మెల్యే కొడాలి వెంకటేశ్వరరావు (నాని), ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, ఎస్పీ పి.జాషువా, డి ఆర్ఓ, ఆర్‌డిఓ, పోర్టు అధికారులు తదితరులతో సమావేశమయ్యారు. అనంతరం ఆమె నేరుగా మచిలీపట్నం పోర్ట్ నిర్మాణ స్థలం, హెలిపాడ్, పైలాన్‌లను పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభ స్థలాలను ఎంపిక చేసేందుకు నోబుల్ కళాశాల పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లను ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీ వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయా కార్యక్రమ నిర్వహణ నిమిత్తం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ, మచిలీపట్నం పోర్టు యావత్ కృష్ణాజిల్లా ప్రజల చిరకాల వాంఛ ను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈనెల 22వ తేదీన నెరవేర్చుతున్నారన్నారు. మచిలీపట్నం పోర్టు పనులకు భూమి పూజ చేయడం ఒక చారిత్రాత్మకమైన మధుర ఘట్టం అని మంత్రి రోజా అభివర్ణించారు. దాదాపు 5 వేల కోట్లతో 17 వందల ఎకరాల్లో మొదటి దశ పోర్టు నిర్మాణ పనులు ఆరోజు నుంచే మొదలు కాబోతున్నాయి అన్నారు. ముఖ్యమంత్రిగా నాలుగు సంవత్సరాల పాలనా కాలంలో నాలుగు పోర్టులను అభివృద్ధి చేస్తున్న ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఈ పోర్టులు పూర్తయితే, ప్రత్యక్షంగా, పరోక్షంగా 20,000 మంది ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయిన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో విజన్ ఉన్న నాయకుడే కాక సక్సెస్ ఫుల్ బిజినెస్ మేనేజ్మెంట్ తెలిసిన విక్టరీ సీఎం అని మంత్రి రోజా కొనియాడారు. ఆయన హయాంలో వివిధ పరిశ్రమలు రాష్ట్రానికి పెద్ద ఎత్తున వచ్చాయన్నారు. వాటిని ఏ విధంగా మరింతగా అభివృద్ధి పరిచి ఉద్యోగ అవకాశాలు మెరుగుపరిచి యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కష్టించి ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు గుడివాడలో ఈనెల 19వ తేదీన 800 కోట్ల రూపాయలతో దాదాపు 9 వేల టిడ్కో ఇళ్లను నిర్మించి ఆధునాతన వసతులు, మౌలిక సదుపాయాలతో కూడిన ఇళ్లను పేదలకు ముఖ్యమంత్రి 19వ తేదీన అందజేయనున్నారని మంత్రి రోజా తెలిపారు. అనంతరం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ, కొద్ది నెలల క్రితం ప్రజా ప్రతినిధులు అధికారుల సమన్వయంతో కృష్ణా జిల్లాలో పెడన, అవినిగడ్డ నియోజకవర్గాల్లో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేశామన్నారు. బందరు పోర్టు ఒక చారిత్రాత్మకవసరమని గుర్తించి ప్రజాభీష్టాన్ని నెరవేర్చేందుకు మే నెల 22వ తేదీన మచిలీపట్నం వస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఘన స్వాగతం అందరం పలుకుదామన్నారు.

కలెక్టర్ పి. రాజాబాబు వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతూ, ఈనెల 22వ తేదీన మచిలీపట్నంలో జరిగే పోర్టు నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన ముఖ్యమంత్రి అనంతరం మచిలీపట్నంలో జరిగి బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం నగర పాలక సంస్థ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత థామస్ నోబుల్, మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ సలార్ దాదా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీవో ఐ. కిషోర్, మచిలీపట్నం తహసిల్దార్ సునీల్ బాబు, మచిలీపట్నం పోర్టు ఎండి విద్యాశంకర్, మెగా ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ హెడ్ తులసీదాస్, డ్వామా పిడి జీవి సూర్యనారాయణ, మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ చంద్రయ్య, పలువురు కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొడాలి నానిను కలిసిన డీఎస్పీ శ్రీకాంత్

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పి. శ్రీకాంత్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గుడివాడ సబ్ డివిజన్ పరిస్థితులపై ఎమ్మెల్యే కొడాలి నాని, డీఎస్పి శ్రీకాంత్ కొద్దిసేపు చర్చించారు.

కష్టజీవి సొమ్ము...దొంగల పాలు

ఐస్‌క్రీమ్ అమ్ముకున్న కార్మికుడి డబ్బులు ఎత్తుకెళ్లిన దుండగులు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: కష్టజీవి సొమ్ము దొంగలపాలైంది. రాత్రనక పగలనక కష్టపడి సంపాదించిన సొమ్మును గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన విజయవాడ మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నగరానికి చెందిన ప్రమోద్ కుమార్ పాల్(30) నగరంలో ఐస్‌క్రీమ్ అమ్ముకుని జీవనం సాగిస్తుంటాడు. బందర్‌రోడ్డు టీప్సీ, టాప్సీ వద్ద ఐస్‌క్రీమ్ అమ్ముతుండంగా గుర్తుతెలియని ముగ్గురు యువకులు ఐస్‌క్రీమ్ కావాలని అతని వద్ద ఉన్న రూ.2వేలు దోచుకుని ద్విచక్రవాహంపై పరారైయ్యారు. ఈ ఘటన పై బాధితుడి మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-కూచిపూడి : ఈ నెలలో కురిసిన అకాల వర్షాలు మూలంగా తడిచిపోయిన మొక్కజొన్న లను ప్రభుత్వం మద్దతు ధర కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని పామర్రు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త వర్ల కుమార్ రాజా డిమాండ్ చేశారు. ఆయన మొవ్వమండలంలోని వేములమడ గ్రామంలో సాగై తడిసిన మొక్కజొన్న కండెలను పరిశీలించారు. ఈ వర్షాలు బాగా వచ్చే ప్రమాదం కూడా ఉందని వేలాది రూపాయల వ్యయంతో సాగు చేసి అప్పుల ఊబిలో కూడుకుపోతున్న రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి వద్దన్నారు. మండలంలో కూచిపూడి, బార్లపూడి పెదపూడి, భట్లపెనుమర్రు, యద్దనపూడి, వేములమడ, కోసూరు,పెదముత్తేవి, ప్రాంతాలలో దరిదాపు ఎనిమిది వందల ఎకరాలకు పైగా మొక్కజొన్న సాగు చేశారని తయారై ఆరబెట్టుకునే సమయంలో కురిసిన వర్షాలకు తడిసిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, మండల టిడిపి అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, టిడిపి కూచిపూడి అధ్యక్షుడు వీరంకి తులసీదాసు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పేర్ని నానిని కలిసిన ఫోటోగ్రాఫర్లు

విశాలాంధ్ర-మచిలీపట్నం : మచిలీపట్నం డివిజన్ ఫోటోగ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఏర్పడిన కార్యవర్గం మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని)ని ఆర్‌అండ్‌బిలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘ అధ్యక్షులు చిలంకుర్తి నాగభూషణం , కార్యదర్శి వంకా అనంత్ , కార్యవర్గ సభ్యులు నాగబాబు, హరి, బాబి, సాయి ఫణి, శ్రీనివాస్, స్వామి, వాసు, శేషు, సత్యనారాయణ,తదితరులు ఉన్నారు.

కూచిపూడి-పెడసనగల్లుకి రోడ్డు మరమ్మతులు చేయండి

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని కూచిపూడి నుండి పెడసన గల్లుకి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు అడుగుకో గుంట గజానికో గొయ్యిలా మారటంతో రైతులు,ఆటో, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు ఈ ప్రభుత్వానికి పట్టవా ? అని ప్రజలు తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వం గద్దెనెక్కి 4 సంవత్సారాలు అయినా డిపార్టుమెంట్ వారు మర్మతులకోసం నిదులు కూచిపూడి నుండి భట్లపెనుమరుకి కేటాయిస్తే, ప్రజాప్రతినిధులు ఆ నిధులను పెడసనగల్లు నుండి భట్లపెనుమర్రు కోసం వినియోగించారంటూ ఆరోపిస్తున్నారు. మనుషులు నడవడానికి సైతం ఇబ్బంది పడే పరిస్థితుల్లో ఈ రోడ్డు దుస్థితి ఉందని, వర్షం వస్తే గోతులలో నిలిచిన నీరు తో వాహనదారులు ప్రమాదాలు పాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు వెంటనే పునః నిర్మాణం చేయలని ఈప్రభుత్వాన్ని డిమండ్ చేశారు.

నేటి నుంచి గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర-పమిడిముక్కల: ఈ నెల ఎనిమిదో నుంచి జూన్ 11 వ తేదీ వరకు గ్రంథాలయాలల్లో వేసవి విజ్ఞాన శిబిరం (సమ్మర్ క్యాంప్) నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు తెలిపారు.ఏపి పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు ఐదేళ్ళ నుంచి 15 ఏళ్ళ లోపు పిల్లలు వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేందుకు ప్రతి రోజూ ఉదయం 8గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.వేసవి విజ్ఞాన శిబిరంలో పిల్లలు కథలు చదివించటం చెప్పించటం స్పోకెన్ ఇంగ్లీష్ డ్రాయింగ్ నేర్పించి పోటీలు నిర్వహించి బహుమతులను అందజేస్తామన్నారు.ఈ శిబిరంలో విద్యార్థులు వినియోగించు కోవాలని కోరారు.కాగ అగినపర్రు, మేడూరు, పెనుమత్స, కపిళేశ్వరపురం గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరం సద్వినియోగం చేసుకోవాలని ఆయా గ్రంథాలయాల పాలకులు తెలిపారు.

కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు అసోసియేషన్ అధ్యక్షురాలు మంజుల దేవి కోరారు. ఈమేరకు ప్రభుత్వ ఆసుపత్రి సందర్శనార్థం వచ్చిన ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనికి మంజుల దేవి వినతి పత్రం అందజేశారు. అన్ని జిల్లాలలో స్కూల్ ఆఫ్ నర్సింగ్స్ అరేంజ్ చేయాలని, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. 28 నుంచి 30 సంవత్సరాలు సర్వీస్ కంప్లీట్ అయినా గాని స్టాఫ్ నర్సు లకి హెడ్ నర్స్ ప్రమోషన్ల విషయములో డీ ఏం ఈ నుంచి జాప్యం జరుగుతుందని, ప్రాసెస్ లో ఉన్న గ్రేటు 2 నర్సింగ్ సూపరెంటెండెంట్ టు గ్రేడ్ 1 నర్సింగ్ సూపరెంటెండెంట్ ప్రమోషన్స్ ఫైల్ ని త్వరితముగా మూవ్ చేయాలని కోరారు.

విద్యతోనే అభివృద్ధి: జెడ్పీటీసీ అన్నవరపు

విశాలాంధ్ర-గన్నవరం : ప్రభుత్వ పాటశాల పిల్లలు ప్రైవేటు పాఠశాలలతో పాటు ధీటుగా మంచి మార్కులు తెచ్చుకున్నా ముస్తాబాద గ్రామ జిల్లా ప్రజపరిషత్ పాటశాల విద్యార్థిని షేక్ ఖాజాబి 567 మార్కులు తెచ్చుకొన్నా ఆ అమ్మాయి ఆ పాఠశాలలో మొదటి ర్యాంకుతెచ్చుకున్నారని,గ న్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపుఎలిజా బెత్ రాణి అన్నారు. ముస్తాబాద గ్రామంలోని వారి ఇంటికి వెళ్ళిఆ పాపకు శాలువా కప్పి స్వీట్ తినిపించి అభినందించారు. అదే పాఠశాలలో 565 మార్కులు తెచ్చుకున్న విద్యార్థి మిండా పౌల్ ఇంటికి వెళ్లి శాలువా కప్పి అభినందించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ విద్య ద్వారానే ప్రతి ఒక్కరు అభివృద్ధి అవుతారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను వైఎస్సార్ ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గతం లో ఎవరు చేయని విధంగా విద్యా కనుక, అమ్మ వడి, నాడు నేడు పథకాలతో ఎంతో అభివృద్ధి చేశారని, విద్యా ద్వారా పేద విద్యార్థులు విద్యకు దూరం కాకుండా అందరు చదువుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ కేడీసీ బ్యాంక్ అధ్యక్షులు మేడసాని శ్రీనివాస్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కందుల రాజేష్, ఎంపీటీసీ మున్ని, వైసీపీ నాయకులు మాజీ సర్పంచ్ కైలే ఆదిలక్ష్మి, షేక్ బాజీ, దాస్ భిక్షు, ప్రజా సంఘాల నాయకులు మాతంగి జాన్ వేస్లీ, గన్నవరం మండలం మహిళా నాయుకులు రామలక్ష్మి, పద్మ, రజిని తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరం ఘంటసాల నాటకం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : పద్మశ్రీ ఘంటసాల శత జయంతి ఉత్సవముల సందర్భంగా ఆదివారం సాయంత్రం ఘంటసాల సంగీత నృత్య కళాశాలలోని కళావేదికపై కామ్రేడ్ జి ఆర్ కె పోలవరపు సాంస్కృతిక సమితి,మధురం సాంస్కృతిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం,స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో పేద సురభి కళాకారుల సహాయార్థం ఘంటసాల నాటకం రసవత్తరంగా ప్రదర్శించబడింది. శ్రీ సాయి సంతోషి నాట్యమండలి స్టేషన్ ఘన్పూర్ సురభి కళాకారులచే ఘంటసాల జీవిత చరిత్ర ఆయన గాన ప్రస్థానం వివరిస్తూ 25 మంది వారి వారి పాత్రాలలో చక్కగా నటించి మెప్పించారు. కృష్ణాజిల్లా చౌటుపల్లి గ్రామంలో జన్మించటం నుంచి విజయనగరంలో ఆయన సంగీత కళాశాలలో పట్రాయని సీతారామశాస్త్రి సంగీతాభ్యాసం చేయటం ఆ కళాశాల ప్రధానాధ్యాపకులు హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసవర్యుల నుంచి తంబురా అందుకోవటం, గుర్రం జాషువా పద్యాలు జంధ్యాల పాపయ్యశాస్త్రి పుష్పవిలాపం పాడిన సమయంలో వారి పరిచయంతో కూడిన అనుభవాలు, ఎన్టీ రామారావు కు హార్మోనియంపై సంగీతం నేర్పించడం, బాలాంత్రపు రజనీకాంతరావు ఘంటసాలను పిలిపించి గానం చేయించడం, విదేశీయాత్ర కోసం పడిన ఇబ్బందులు రజతోత్సవ సభ, తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి సమక్షంలో గానం చేయటం, చివరగా భగవద్గీత రికార్డు చేయటం వంటి ముఖ్య ఘట్టాలతో ఒక గంట 40 నిమిషాల సేపు ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనను భాస్కరుని సత్య జగదీష్ రచించి దర్శకత్వం వహించగా మండలి బుద్ధ ప్రసాద్ సమర్పించారు. గోళ్ళ నారాయణరావు నిర్వహణ చేశారు. ముఖ్య అతిథిగా ఎస్ బి ఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ రంగరాజన్,ప్రత్యేక అతిథిగా డాక్టర్ ఎం ప్రభాకర్, మండలి బుద్ధ ప్రసాద్,గోళ్ళ నారాయణరావు తదితరులు మాట్లాడారు.

అనాగరికమైన యజ్ఞయాగాలను విరమించుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 12 నుండి విజయవాడ లోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో రాజశ్యామల యాగం నిర్వహించడం పైగా పది కోట్ల ప్రజాధనం ఖర్చుపెట్టడం లౌకిక విరుద్ధం ఆటవికం, అనాగరికం అని దానిని తక్షణమే విరమించుకోవాలని ఏపి హేతువాద సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షులు నార్నే వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఒకప్రక్క మనిషి ఇతర గ్రహాల మీద కాలు పెట్టిన ఆధునిక సమాజంలో భారత రాజ్యాంగ లౌకిక సూత్రాలకు విరుద్ధంగా ఇలా యాగాలు మత పరమైన క్రతువులు చేయడం సరైన పద్ధతి కాదని, చాలా సిగ్గుచేటయిన విషయము అశాస్త్రీయం అని ఆక్షేపించారు. ఈయాగం ఎవరికోసం పురోహితులకోసమా, ప్రజల సంక్షేమం కోసమా, ముఖ్యమంత్రి మరలా ఆ పీఠం ఎక్కేందుకా ముఖ్యమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. రాజులకాలంలో పుత్రులకోసం పుత్రకామేష్టియాగం, శత్రువులను చంపటంకోసం శత్రుసంహారక యాగం, వర్షంకోసం వరుణయాగం, చావును జయించటం కోసం మృత్యుం జయయాగం, పాములను చంపటంకోసం సర్పయాగం చేసేవారన్నారు. ఈ ఆధునికకాలంలో ముఖ్యమంత్రి ఈ యాగం ఏమి ఆశించి చేస్తున్నారని అన్నారు. యాగాలన్నీ పురోహితుల స్వార్థం కోసం పొట్టలు నింపటం కోసమేనని అని వేమన నాలుగొందల సంవత్సరాల క్రితమే ఎలుగెత్తి చాటారని గుర్తు చేశారు. యాగాలవలన ఏమీ జరగదని,కోట్ల రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని అవేదన వ్యక్తం చేశారు. హేతువాద సంఘం నాస్తిక ప్రముఖులు మోతుకూరి అరుణ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగము ప్రకారము నడుచుకుంటానని ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి రాజ్యాంగ పరిధిలో ప్రధాన మంత్రి,రాష్ట్రపతి గవర్నర్, సుప్రీం కోర్టు జడ్జి ఉన్నతాధికారులు పరిపాలనలో మత పరమైన క్రతువులకు దూరంగా ఉండాలని, వ్యక్తిగత భక్తిని వారి వారి ప్రోటోకాల్ ఉపయోగించి చేయడం, అలాగే రాకెట్ ప్రయోగంలో పూజలు చేయడం అశాస్త్రీయం అన్నారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 51 ఏ (హెచ్) క్రింద ప్రజల్లో శాస్త్రీయ దృక్పదం కల్గించే బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని, ఇలా చెయ్యటం రాజ్యాంగ ధిక్కరనే అవుతుందని ఈయాగంలో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు పాల్గొనటం కూడా రాజ్యాంగ సూత్రాలకు వ్యతిరేకం అన్నారు. ఈ రాజకీయ యాగాన్ని తక్షణమె విరమించు కోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హేతువాద సంఘం ప్రతినిధులు ఎమ్ లక్ష్మీనారాయణ, చెరుకూరి మురళీకృష్ణ,పర్వతం సత్యనారాయణ, పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు వర్ధంతి

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక నూతన మున్సిపల్ కార్యాలయం సమీపంలో గుడివాడ క్షత్రియ సేవ సమితి, స్మారక కమిటీల సంయుక్తం అధ్వర్యంలో దేశభక్తుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతిని ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు మాట్లాడుతూ బ్రిటిష్ వారు మన్యం ప్రాంతంలోని గిరిజనుల హక్కులను కాలరాస్తు, స్త్రీలని వేధిండం. గిరిజనులు భూములని లాక్కొనప్పుడు అల్లూరి సీతారామరాజు గిరిజనులని చైతన్య పరిచి, బ్రిటిష్ వారిపై అల్లూరి విప్లవం రెండు దశలలో పోరాడరన్నారు. 1924 మే 7న బ్రిటిష్ వారు అల్లూరిని కాల్చి చంపాడం జరిగిందన్నారు. భోగాపురం ఎయిర్పోర్ట్‌కి అల్లూరి సీతారామరాజు ఎయిర్పోర్టుగా నామకరణం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీతారామరాజు సార్మక కమిటి ఫౌండర్, సాగిరాజు ఉదయభాస్కరరాజు, సేవసమితి గౌరవ అధ్యక్షడు గాదిరాజు జగ్గరాజు, క్షత్రియ సేవ సమితి అధ్యక్షులు కోసూరి కామరాజు(రవిరాజు), కార్యదర్శి వాత్సవాయి కుమార్‌రాజు, ట్రజరర్ కుచర్లపాటి శ్రీనివాసరాజు(వాసు), ఫెడరేషన్ నాయకులు రుద్రరాజు, విజయకుమార్‌రాజు, డి.దామోదర్‌రాజు, సాగిరాజు గజపతరాజు, నాగవర్ధన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కోసూరులో మన్యం వీరుని వర్ధంతి



విశాలాంధ్ర-కూచిపూడి : బ్రిటిష్ పాలకుల ఎదురొడ్డి పోరాడి నిలిచి వారి తుపాకి గుళ్ళకు బలైన విప్లవ యోధుడు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలు, పోరాటపటిమ నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోసూరు మాజీ సర్పంచ్ చిందా వీర వెంకట నాగేశ్వరరాజు(బుజ్జి) పిలుపునిచ్చారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా ఆదివారం మొవ్వ మండలంలోని కోసూరు గ్రామంలో వర్ధంతి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు జిల్లా ప్రజానాట్యమండలి కన్వీనర్ కోసూరువెంకట అప్పారావు, గ్రామఉపసర్పంచ్ దళపతిరావు రామకృష్ణంరాజు, మండల బిజెపి అధ్యక్షుడు డాక్టర్ ఎన్. నరసరాజు, గ్రామస్తులు చిందా కృష్ణంరాజు, చిందాశ్రీనివాసరాజు, దళపతిరావు వెంకట రామరాజు, బోరుకాటి సుబ్రహ్మణ్య రాజు, దళపతిరావు శ్రీనివాసరాజు తదితరులు, క్షత్రియ సంఘం యోజన నేతలుఅధిక సంఖ్యలో హాజరైనారు. పెదముత్తేవిలో క్షత్రియ సంఘం సభ్యులుఅల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

విశాలాంధ్ర-గుడివాడ : గుడ్లవల్లేరు మండలంలో రూ. 47లక్షలతో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి పనులను ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కెడిసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావుతో కలిసి గుడ్లవల్లేరు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే నాని పాల్గొన్నారు. మండలంలోని అంగలూరులో 29.75లక్షల వ్యయంతో పిఏసిఎస్ భవనం, 150 మెట్రిక్ టన్నుల గౌడౌన్ నిర్మాణానికి, 17.35 లక్షలతో వెనుతురుమిల్లు గ్రామంలో నిర్మించిన ఏసిఎస్ భవనం, ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతాంగానికి మేలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలను రైతన్నలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 19వ తేదీన గుడివాడలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన రోజు గుడివాడలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగలూరు పిఏసిఎస్ చైర్మన్ దుగ్గిరాల శేషుబాబు, వెనుతురుమిల్లి చైర్మన్ చందన నాగన్ననాయుడు, బ్యాంకు డైరెక్టర్ పడమటి సుజాత, రాష్ట్ర నాయకులు దుక్కిపాటి భూషణ్, నాయకులు పాలేటి చంటి, మెరుగుమాల కాళీ, తదితరులు పాల్గొన్నారు.

మలబార్‌లో బ్రైడల్ జ్యూవెలరీ

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్,అత్యంత ప్రజాదరణ పొందిన తమ 'బ్రైడ్స్ ఆఫ్ ఇండియా ప్రచారం యొక్క 10వ ఎడిషన్ ఎంజీ రోడ్డు లోని మలబార్ షో రూమ్ లో ప్రదర్శించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బ్రాండ్ అంబాసిడర్లు అలియా భట్, అనిల్ కపూర్ తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వధువులతో ఒక ప్రత్యేక థీమ్ సాంగును చిత్రీకరించినట్లు తెలిపారు. బ్రైడ్స్ ఆఫ్ ఇండియా 2023 ప్రచారం ఈ థీమ్ సాంగుతో పాటు, అనేక రకాల బ్రైడల్ జ్యూవెలరీ లుక్స్ మరియు వివిధ ప్రాంతాలకు సంబంధించిన నిర్దిష్టమైన బ్రైడల్ జ్యూవెలరీ కలెక్షన్లను కూడా ప్రదర్శిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ మేనేజర్ గోపి మాట్లాడుతూ "ఈ తాజా ఎడిషన్లో, మా బ్రైడ్స్ ఆఫ్ ఇండియా క్యాంపెయిన్ ఆధునిక వధువులలో ఒక ట్రెండ్సెట్టర్గా ఉద్భవించిందన్నారు. అనంతరం ప్రముఖ మోడల్ అంకితా రాజ్ మోట్లాడుతు భారత దేశ దేశంలోని విభిన్న సంస్కృతులకు చెందిన వధువులకు ఆకర్షించుతాయనటంలో సందేహం లేదని బ్రైడ్స్ ఆఫ్ ఇండియా మాయాజాలాన్ని అనుభూతి చెందడానికి మిమ్మల్ని అందరినీ స్వాగతిస్తున్నామన్నారు.

కేటీ రోడ్డు పూర్తయ్యేనా..?

-8 నెలలు గడుస్తున్నా పూర్తికాని వైనం
-రాకపోకలకు ప్రజల ఇబ్బందులు
-పట్టించుకోని పాలకులు, అధికారులు
-ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్) : విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో చిట్టినగర్ నుండి నెహ్రూ బొమ్మ సెంటర్ వరకు ఉన్న కేటీ రోడ్డు పనులు ప్రారంభించి 8 నెలలు గడుస్తున్నా , రోడ్డు పూర్తి కాలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రోడ్డును నెహ్రూ బొమ్మ సెంటర్ నుండి చిట్టినగర్ వరకు, గత సంవత్సరంలో పనులు ప్రారంభించి పూర్తి చేయటానికి పది నెలలు పట్టిందని, మరి ప్రస్తుతం నత్తనడక పనులతో ఉన్న ఈ రోడ్డు పనులు అర్ధ సంవత్సరానికైనా పూర్తయ్యేనా ? అని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వన్‌టౌన్ కొండ ప్రాంతంలోనూ, కింద ప్రాంతంలోనూ అత్యధికంగా రోజువారీ పనులు చేసుకొని జీవించే వేలాది కార్మికులు ఉన్నారు. వీరంతా కాళేశ్వరరావు కూరగాయల మార్కెట్, వస్త్రలత, శివాలయం వీధి ఆధారంగా షాపు గుమస్తాలుగా, ముఠా కార్మికులుగా వివిధ వృత్తులలో జీవితాన్ని కొనసాగుతున్నారు.

వీరితోపాటు చిరు వ్యాపారులకు, చిరు ఉద్యోగులకు, రోడ్డు పనులు నిమిత్తం ట్రాఫిక్ సమస్యతో పాట్లు, ఫీట్లు తప్పట్లేదనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నెలరోజులుగా ఎండలు తీవ్రత విపరీతంగా పెరిగిపోయింది, మరోక పక్క స్కూల్, కాలేజీ విద్యార్థుల పరీక్షల రాక పోకలతో రద్దీ పెరిగింది. పాల ఫ్యాక్టరీ నుండి కాళేశ్వరరావు మార్కెట్‌కు వెళ్లాల్సిన బస్సులు ఈ రోడ్డు పనులు నిమిత్తం, చిట్టి నగర్ సొరంగంలో నుండి కుమ్మరిపాలెం మీదుగా మార్కెట్‌కి దారి మళ్లించారు. స్కూల్ విద్యార్థులకు కష్టాలు తప్పట్లేదు. దీనిఫలితంగా చుట్టూ తిరిగి మార్కెట్‌కి రావటానికి గంట పైనే పడుతుంది. బస్‌ఛార్జి కూడా అదనంగా ఖర్చు అవుతుందని తమ బాదని తెలియచేస్తున్నారు.

1985లో కమ్యూనిష్టు పార్టీ తరుపున గెలిచిన ఉప్పలపాటి రామచంద్రరాజు నుండి, 2009 లో ప్రజారాజ్యం నుండి గెలిచిన శ్రీనివాసరావులు వీరంతా కూడా ప్రజలకు ఇబ్బందులు పడకుండా, ఆర్థికభారం లేకుండా అభివృద్ధే లక్ష్యంగా పోరాటం చేశారనీ, ప్రస్తుతం మన పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెలంపల్లి మరియు ఇతర ప్రజాప్రతినిధులు గత మూడున్నర ఏళ్ళుగా ప్రజా సమస్యలకు తిలోదకాలిచ్చి ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగించే మీ తీరుని మేము గమనిస్తున్నాం అని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సీట్లు, ఓట్లు మాకు ముఖ్యం అనే చందంగా మీ ఆరాటం ఆపి, నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు కొరకై పోరాటం చేయాలని స్థానిక ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఇకనైనా అధికార యంత్రాంగం చిత్తశుద్ధి తో తమ విధులు వేగవంతం చేసి త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బైక్‌ను ఢీకొన్న టాటా ఏసి

తండ్రీ, కొడుకు మృతి

విశాలాంధ్ర-వీరులపాడు: మండలంలోని అల్లూరు గ్రామ శివారు వద్ద ఆర్అండ్‌బి రహదారిపై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగినది. కోడి పిల్లలతో వస్తున్న టాటా ఏసీ వాహనం ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు తీవ్ర గాయాలు పాలయ్యారు. ఈ ప్రమాదంలో పరిటాల గ్రామానికి చెందిన సయ్యద్ ఖాదర్(52) అక్కడికక్కడే మృతిచెందగా అతని కుమారుని జానీ భాష(25) పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం 108లో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ జానీ భాష కూడా మృతి చెందాడు.పరిటాల నుండి రేమిడిచర్ల వెళుతుండగా ఈ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుందని మృతుని బంధువులు తెలిపారు.ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కొడుకులు మృతి చెందటంతో పరిటాల గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనపై చిన్న కొడుకు సయ్యద్ నసీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.మహాలక్ష్ముడు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

విశాలాంధ్ర-వత్సవాయి : అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి చెందిన ఘటన మండలంలోని పోలంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన తుంగ ప్రవళిక (15) శనివారం నుంచి కనిపించకపోవడంతో కుటుంబీకులు గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం గ్రామ శివారులో బావిలో విగతజీవిగా మారింది. కుటుంబీకుల రోదన వర్ణనాతీతంగా మారింది. స్థానిక ఎస్ఐ అభిమన్యు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని బావిలో నుంచి వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పలు కోణాలలో దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

ఆదాముకు సీపీఐ నాయకుల పరామర్శ

విశాలాంధ్ర-గంపలగూడెం : మండలంలోని గోసవీడు గ్రామానికి చెందిన గద్దల ఆదాం తండ్రి వెంకటరత్నం ఇటీవల మృతి చెందారు. సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా ఆదివారం ఆయన స్వగృహానికి వెళ్లి వెంకటరత్నం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు చిలుకూరు వెంకటేశ్వరరావు, తదితరులు ఆదాం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తిరుపతమ్మ సన్నిధిలో ఎంపీ గల్లా జయదేవ్

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : గోపయ్యస్వామి, తిరుపతమ్మ అమ్మవారిని ఆదివారం గుంటూరు ఎంపీ గల్లా జయ దేవ్, అమర రాజా గ్రూప్ వ్యవస్థాపకుడు గల్లా. రామచంద్ర నాయు డు,అమ్మ వారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ చైర్మన్ ఇంజం. కేశవరావు. ఆలయ పూజారులు, వేద పండితులు. ఆలయ ఏ ఈఓలు తిరుమలేశ్వరరావు, ఉమాపతి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బత్తుల కృష్ణ, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌లు ఎంపీకి పూలమాలు, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి శేషా వస్త్రాలు.తీర్ధ ప్రసాదాలు అనజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్లు నూతలపాటి చెన్న కేశవరావు, కర్ల వెంకటనారాయణ, టీడీపీ మండల అధ్యక్షులు చింతల సీతారామయ్య, మాజీ ఎంపిపి. వేగినేటి గోపాలకృష్ణమూర్తి, చుంచు రమేష్‌బాబు, మాదినేని వెంకట్రావ్, నూతలపాటి వెంకటేష్, ముళ్లపాటి ప్రసాదరావు, ప్రభాకరరావు, కొలిపాక బ్రహ్మం, నల్లపునేని కొండ, పెనుగొండ రామారావు, ఎస్ కె ఆజాద్, ఎస్‌కె సుభానీ, కనపర్తి శ్రీను పాల్గొన్నారు.

ఎంపీ గల్లా ను కలసిన శ్రీరామ్ తాతయ్య

గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ ఆదివారం పెనుగంచిప్రోలు గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య జయదేవ్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చింతల. సీతారామయ్య, వేగినేటి గోపాలకృష్ణమూర్తి, కర్ల వెంకటనారాయణ, ముళ్లపాటి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

గుబాళించిన స్వరపరిమళం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : తెలుగు కళావాహిని,జి ఆర్ కె పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై మాధవపెద్ది సత్యం,పిఠాపురం నాగేశ్వరరావు,ఘంటసాల పాడిన చిత్ర గీతాలతో జరిగిన సినీ సంగీత విభావరి సంగీత సాహిత్య వైభవాన్ని చాటింది. చింతకాయల చిట్టిబాబు పర్యవేక్షణలో తెలుగు కళావాహిని మాజీ ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిగా విశిష్ట సేవలు అందించిన నోకవరపు ప్రసాదరావు ద్వితీయ వర్ధంతి పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో గాయనీ గాయకులుగా హేమమాలిని, స్వాతి,లక్ష్మీతులసి,శ్రీదుర్గా నాగమణి,శ్యాంప్రసాద్,మస్తాన్ వలి, చంద్రశేఖర్, డేవిడ్ రాజు, ఆశయ్య,శివశర్మ తదితరులు బొమ్మా బొరుసా పందెం వేయి, మా ఊళ్ళో ఒక పడుతుంది,నెరా నెరా నెరా బండి,నన్ను చూసి నవ్వింది,వివాహ భోజనంబు వింతైన వంటకంబు, సరదా సరదా సిగిరెట్టు,కనకమా చిట్టి కనకమా, రారండోయ్ రారండోయ్ శివశంకరి, బొమ్మను చేసి ప్రాణము పోసి,చందురుని మించు అందమొలికించు, ఊహలు గుసగుసలాడే వంటి ఇత్యాది పాటలను శ్రావ్యంగా పాడి వినిపించారు. అతిథులుగా శింగంశెట్టి చంద్రశేఖర్,ప్రసూన రామన్,చీదెళ్ళ నాగేశ్వరరావు, గోళ్ళ నారాయణరావు,డాక్టర్ చెట్లపల్లి మారుతి ప్రసన్న,జ్ఞాన కిషోర్ విచ్చేసి గానంతో, సంగీత దర్శకత్వంతో తెలుగు చలనచిత్ర సీమను సుసంపన్నం చేసిన మహనీయుల ప్రజ్ఞ ను కొనయాడుతూ గాయనీ గాయకులను అభినందించారు.

బీజేపీపై చర్యలు తీసుకోవాలి : సీపీకి కాంగ్రెస్ ఫిర్యాదు

విశాలాంధ్ర-విజయవాడ : ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేపై హత్యా ప్రయత్నం జరుగుతుందనే ఆరోపణలతో పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆదేశంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు బీజేపీఐ చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం పోలీస్ కమీషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్షునిపై హత్యా యత్నాన్ని తీవ్రంగా ఖండించారు. ఫిర్యాదు చేసిన నరసింహారావు వెంట ఏపీసీఈ లీగల్ సెల్ చైర్మన్ వి.గురునాథం, ఏఐసీసీ సభ్యులు మేడా సురేష్, ఖాజా మొహినుద్దీన్, ఏపీసీసీ ఆర్టీఐ సెల్ చైర్మన్ పి.వై.కిరణ్, లీగల్ సెల్ శాస్త్రి, బైపూడి నాగేశ్వరరావు, కొమ్మినేని సురేష్, అన్సారీ, రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

కూచిపూడిలో నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండల రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన స్థానిక రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయంలో ఉచిత నేత్ర వైద్యం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగావిశ్రాంత ఉపాధ్యాయులు కాశీ భొట్ల నారాయణమూర్తి సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో ఉయ్యూరు సమతా శంకర నేత్రాలయ వైద్య నిపుణులు డాక్టర్ బృందం చికిత్సలు నిర్వహిస్తారని వివరించారు.

అత్యున్నత ప్రమాణాలకు కేరాఫ్ 'ఇగ్నో'

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రపంచంలోనే అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించే విద్యాసంస్థల్లో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ముందు వరుసులో ఉందని ఆ సంస్థ విజయవాడ ప్రాంతీయ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ కే.సుమలత అన్నారు. కేబీఎన్ కళాశాల ఇగ్నో స్టడీ సెంటర్ నూతన విద్యార్థుల ఇండక్షన్ మీటింగ్ ఆదివారం ఆ కళాశాల ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సుమలత మాట్లాడుతూ ఉన్నత విద్యారంగంలో ఇగ్నోకు ప్రత్యేక స్థానముందన్నారు. ప్రధానంగా విద్యార్థులకు వారివారి కోర్సులకు సంబంధించి సంపూర్ణ జ్ఞానం అందించే దిశగా కోర్సు రూపకల్పన ఉంటుందన్నారు. సుమారు మూడు దశాబ్దాలుగా ఇగ్నో ఉన్నత విద్యారంగ వ్యాప్తికి ఇతోధిక సేవలందిస్తుందన్నారు. ఇటీవలే యూజీసి నాక్ నుంచి ఏ డబుల్‌ప్లస్ గ్రేడ్‌ను సాధించి ప్రమాణాల విషయంలో అగ్రగామిలో ఉందని రుజువు చేసిందన్నారు. తరగతుల నిర్వహణతో పాటుగా, ప్రయోగశాలలో సాధన, ఎసైన్‌మెంట్లు తదితర రూపాల్లో బోధనా పద్ధతులు ఉంటాయన్నారు. కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో సుదీర్ఘ కాలంగా ఇగ్నో స్టడీ సెంటర్ కొనసాగుతుందని వివరించారు. ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ బీ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో దూరవిద్యను అందించే సంస్థగా ఇగ్నో ఘనతికెక్కిందన్నారు. స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఎస్ సాంబశివరావు మాట్లాడుతూ తమ స్టడీ సెంటర్‌లో క్రమం తప్పకుండా తరగతులు కొనసాగటమే కాకుండా మంచి సదుపాయాలు ఉన్నాయని వివరించారు. సుదీర్ఘకాలంగా తమ స్టడీ సెంటర్ నుంచి ఎందరో ఉన్నత విద్యా కోర్సులను పూర్తి చేసి మంచి స్థాయిల్లో నిలిచారని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డీ పవన్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ది కేరళ స్టోరీ సినిమాను దేశ వ్యాప్తంగా నిషేధించాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ది కేరళ స్టోరీ సినిమాను దేశ వ్యాప్తంగా నిషేధించాలని ఎంసీపీఐ(యూ) డిమాండ్ చేసింది. ఆదివారం విజయవాడ పంజా సెంటర్‌లో సినిమా నిషేధించాలని నిరసన చేశారు. ఈ నిరసనకు ముస్లిం ఐక్య వేదిక, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ సంగీభావం తెలిపింది. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఖాదర్‌బాషా మాట్లాడుతూ ది కేరళ స్టోరి సినిమా లో వాస్తవం లేదని అవాస్తవంగా సినిమా లు తీసి హిందూ ముస్లిం మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ది పొందాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ మనువాదం తీసుకొని వస్తున్నా రని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ కు నిజం గా ముస్లింల పై ప్రేమ ఉంటే ఆంధ్రప్రదేశ్ లో సినిమా ను నిషేదించాలి అని డిమాండ్ చేశారు. ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు షేక్.సలావుద్దీన్ మాట్లాడుతూ బీజేపీ వైఫల్యం పై, బీజేపీ ఆర్ఎస్ఎస్ మూక దాడుల పై సినిమాలు చెప్పారు. ఇండియన్ యూనియన్ ముస్లిం ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి షేక్. ఖాజావలి మాట్లాడుతూ సినిమా వాస్తవం అని నిరుపిస్తే కేరళ రాష్ట్రం కోటి రూపాయలు ప్రకటిస్తా ము అని ప్రకటించింది అని కానీ ఎవరు ముందుకు రాలేదని, మనువాదులు ఇకనైనా ఆత్మ పరిశీలన చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎంసీపీఐ(యూ) పార్టీ కృష్ణా జిల్లా కార్యదర్శి సయ్యద్ సలీం, విజయవాడ కార్యదర్శి షేక్. అజాజ్, సయ్యద్ సుభాని, ఐక్యవేదిక నాయకులు షేక్. కరీం, అబ్దుల్ రెహమాన్, ఇబ్రహీం, ముస్లిం నాయకులు సలాం, అబ్దుల్లా, ఎండీ.మక్బుల్, హాజీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు, పెన్షన్ల కోసం ఎదురుచూపులు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు,రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు వారం రోజుల గడిచిన జీతాలు పెన్షన్ల పై ఎదురుచూపులు తప్పడం లేదని జిల్లా జేఏసీ చైర్మన్ ఏపీ ఎన్జీవో అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు ఏ.విద్యాసాగర్ అన్నారు.ఉద్యోగులు ముఖ్యంగా వృద్ధాప్యంలో పెన్షన్ మీద ఆధారపడే పెన్షనర్లు వారం రోజులు గడిచిన పెన్షన్లు జమ కాకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇటువంటి పరిస్థితిని అంతకుముందు ఎప్పుడూ చూసినా దాఖలాలు లేవని, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల మీద పెన్షనర్ల మీద కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని ఒకటో తారీఖున జీతాలు చెల్లింపు జరగాలని, ఆర్థిక ఇబ్బందుల వలన జాప్యం జరిగితే ఎప్పుడు చెల్లింపు చేస్తున్నారో అన్న విషయాన్ని కూడా తెలియజేసే వారే లేకుండా పోయారని అన్నారు.

'పది' ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల విజయభేరి

విశాలాంధ్ర-విజయవాడ : పదవ తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య స్కూల్ మారుతీనగర్ విద్యార్థులు విజయభేరి మోగించారని పాఠశాల ప్రిన్సిపల్ సీహెచ్.సంజన తెలిపారు. ఈ మేరకు ఆదివారం పాఠశాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కె.రిత్విక్ 589 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో కె.భానుతేజ 587 మార్కులు సాధించి రెండవ స్థానంలో మణిమేఖల 585 మార్కులు సాధించి మూడవ స్థానంలో నిలిచారు. అలాగే తొమ్మిది మంది విద్యార్థులు 580 ఆపైన మార్కులు సాధించినట్లు చెప్పారు. సగటున పాఠశాల 541.5 మార్కులుగా ఉన్నట్లు తెలిపారు. ఇది సాధారణ విజయం కాదన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎవరూ అందుకోలేనంత ప్రతిష్టాత్మక విజయాలను శ్రీచైతన్య సొంతం చేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో జి.ఎం. మురళీకృష్ణ, ఆర్ఐ రాజేష్‌బాబు, డీన్ రామారావు, సి.ఇన్‌చార్జ్ రామాంజనేయులు, కో-ఆర్డినేటర్ వేంకట శివ తదితరులు పాల్గొన్నారు.

పారామెడికల్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర-విజయవాడ : కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న పారా మెడికల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏపీ కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ సర్వీసెస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏపీ కో సేవ) ప్రభుత్వాన్ని కోరారు. పారా మెడికల్ సిబ్బందికి బదిలీలలకు అవకాశం కల్పించినందుకు ప్రభుత్వం ప్రధాన సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని ఐఎంఏ హాల్‌లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఏపీ కో సేవ అధ్యక్షులు ఎల్. మణికాంత్, ప్రధాన కార్యదర్శి ఎల్.కరుణాకరరెడ్డి మాట్లా డుతూ ఎస్‌పీహెచ్‌ఏ (ఎం), ఏఎన్ఎం, ఎల్‌టీ, ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్సు తదితర క్యాడర్లలతో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నట్లు చెప్పారు. బదిలీలు లేని కాణంగా గత 20 ఏళ్లుగా కుటుంబానికి దూరం ఆర్థిక ఇబ్బందులతో పని చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం బదిలీలకు అవకాశం కల్పించటంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌ను 100శాతం విజయం దిశగా నడిపించటానికి కృషి చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న తమకు జీవో 27ను సవరించి పీఆర్సీ పునరుద్ధరించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా అన్ని అర్హతలు ఉన్న తమను రెగ్యులర్ చేయాలని కోరారు.

నగరంలో సినీ నటి హనీ రోజ్ సందడి

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : నగరంలోని దేవి పవిత్ర గోల్డ్ అండ్ డైమాండ్స్ షోరూం లో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రైయిడల్ విభాగాన్ని ఆదివారం సినీ నటి హనీ రోజ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చూడగానే ఆకట్టుకునే కలెక్షన్స్ ని మా మహిళలు కోసం ఏర్పాటు చేసిన దేవి పవిత్ర షోరూం అధినేతలు వి. సుధాకర్, కే రాజేష్, వి.జగదీశ్, బ్రహ్మేంద్ర, నాగరాజు, మురళి లకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.విజయవాడ నగరం అంటే తనకు చాలా ఇష్టం అని... ఇక్కడ అభిమానులు చూపించే ప్రేమ మరువలేనిదనీ హర్షం వ్యక్తం చేశారు.,షోరూం లో ఉన్న బ్రైయిడల్ కలెక్షన్స్ చాలా అద్భుతం గా ఉన్నాయనీ వెల్లడించారు. డైమండ్ సెట్ తాను ధరించి చూశాను చాలా బాగుందన్నారు... తాను తప్పక దేవి పవిత్ర గోల్డ్ అండ్ డైమండ్ షోరూం లో డైమాండ్స్ కచ్చితంగా కొనుగోలు చేస్తానని వెల్లడించారు.విజయవాడ మహిళలు తప్పక విచ్చేసి డైమండ్ కలెక్షన్ లు వీక్షించి కొనుగోలు చేయవలసిందిగా ఆకాంక్షించారు.ఈ సందర్భంగా షోరూం అధినేత రాజేష్ మాట్లాడుతూ తమ కస్టమర్లకు ఎప్పటికప్పుడు నూతన మోడల్స్ ,నాణ్యత , మన్నికతో బంగారు , వజ్ర ఆభరణాలను అందిస్తున్నామని వివరించారు. వివాహ ది శుభకార్యాల కోసం బంగారు వజ్రాభరణాలు కొనుగోలు చేసే వారికి సమయం కలసి వచ్చేలా ప్రత్యేక బ్రైడల్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ వద్ద రాజసం ఉట్టిపడే విక్టోరియన్ కలెక్షన్స్ తో పాటు పోల్కి డైమండ్స్, నగిషీ, కుందన బ్రైడల్ జ్యుయలరీ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విజయవాడ పరిసర ప్రాంత ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమం లో షోరూం అధినేత లు వి. సుధాకర్, వి. జగదీశ్, బ్రహ్మేంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్ నిర్వహణకు ఏర్పాట్లు

విశాలాంధ్ర-తిరువూరు: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 10న జరిగే పాలీసెట్ పరీక్ష నిర్వహణకు తిరువూరులో అధికారులు ఏర్పాటు మంది విద్యార్థులను ఈ పరీక్ష కేంద్రాలకు కేటాయించారు. వాహిని ఇంజనీరింగ్ కళాశాల, వాహిని పాలిటెక్నిక్ కళాశాల, శ్రీనిధి టెక్నో స్కూల్, శ్రీనిధి జూనియర్ కాలేజీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తారు.

వేసవి విజ్ఞాన శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-గంపలగూడెం : వేసవి విజ్ఞాన శిబిరం ఈనెల 8వ తేదీ నుంచి జూన్ 11 వరకు గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు పెనుగొలను గ్రంథాలయ అధికారిని పి. జ్యోతిర్మయి ఆదివారం నాడు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు వేసవి విరామంలో గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని అందించేందుకు శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కథలు వినుట, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి వెన్న చెప్పటం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్, వంటి సృజనాత్మక కార్యక్రమాలు రోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు శిబిరాలకు హాజరై సృజనాత్మకతను పెంచుకునేలా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని గ్రంథాలయ అధికారిని వి జ్యోతిర్మయి తెలిపారు.

నిరుపేదలకు అండ టీడీపీ : వర్ల

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని వెంట్రప్రగడ గ్రామ శివారు పులవర్తి గూడెంలో పులవర్తి విజయ కుమారి భర్త అనారోగ్యంతో రెండు సంవత్సరముల క్రితం చనిపోయిన విషయం తెలుసుకున్న టిడిపి శ్రేణులు ఆ పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కుమార్ రాజా ఆ పార్టీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో కొంతమేర ఆర్థిక సహాయం ఆదివారము అందించారని చలసాని వివరించారు. వివరాలలోకి వెళితే రెండు సంవత్సరముల క్రితం ప్రభుత్వం నుండి రెండు లక్షల రూపాయలు ఆర్థిక సాయం మృతుని కుటుంబానికి అందిస్తామని, మట్టి ఖర్చు నిమిత్తం ఐదు వేల రూపాయలు అందిస్తామని ప్రభుత్వ అధికారులు హామీ ఇచ్చారని ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి రాలేదని బాధితురాలు వివరించినట్లు ఆయన తెలిపారు. టిడిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సహజ మరణానికి సుమారు రెండు లక్షల రూపాయల వరకు ఆరోజున టిడిపి ప్రభుత్వ హాయంలో పేదలకు అందించడం జరిగిందని వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ఈ పేద కుటుంబాన్ని ఆదుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సజ్జ శివకుమార్, గుండపనేని శ్రీనివాసరావు, దగాని లెనిన్, బుద్దాలు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జైనుల శోభాయాత్ర

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): జైన ధర్మం అత్యుత్తమమైన జీవన విధానమని ప్రముఖ జైన గురువు మునిరాజ్ అభినందన్‌సాగర్ విజయజీ అన్నారు. పాతబస్తీకి చెందిన తరుణబీన్‌హస్సకుమార్‌జీ బోడోతరియా (73) జైన సన్యాసాన్ని స్వీకరిస్తున్న సందర్భంగా శ్రీ సంభవన్నాద్ జైన్ శ్వేతాంబర్ మూర్తిపూజక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆమెకు సత్కార కార్యక్రమాన్ని పాతబస్తీలోని మార్వాడీ గుడి వీధిలో ఉన్న ఆరాధనా భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జైన గురువు మునిరాజ్ అభినందన్‌సాగర్ విజయజీ ప్రసంగించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని జైనం బోధిస్తుందన్నారు. అందరూ శాంతి, సౌఖ్యాలు విరజిల్లాలని జైనం వివరిస్తుందని పేర్కొన్నారు. తోటి జీవులపైనా ప్రేమను కలిగి ఉండాలని, గాలిలో ఉండే సూక్ష్మ జీవరాశులకు సైతం హాని చేయవద్దని జైనం చెబుతుందన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆచరించ దగ్గది జైన ధర్మమన్నారు. జైనం అనుసరించటం వలన ఎటువంటి చెడు జరిగే అవకాశం లేదన్నారు. సాయంత్రం ఆరాధానా భవన్‌లో ప్రత్యేక భజన కార్యక్రమాలను నిర్వహించారు. జైన సన్యాసాశ్రమాన్ని స్వీకరిస్తున్న తరుణబీన్‌హస్సకుమార్‌జీ బోడోతరియాను సంఘ్ ఆధ్వర్యంలో శోభాయాత్రగా పాతబస్తీలో ఊరేగించారు. ఈ సందర్భంగా మేళతాళాలతో పాటుగా జైన సంప్రదాయ పద్ధతిలో ఊరేగించారు. ఈ సందర్భంగా మహావీర్ భగవాన్ ఉత్సవమూర్తిని రజిత రథంలో ఊరేగించారు. ఈ శోభాయాత్ర పాతబస్తీలోని వెలగలేటి వారి వీధి నుంచి సుబ్బరామయ్యవీధి, రాజారంగయ్యప్పారావు వీధి, పార్కురోడ్డు, భావనారాయణవీధి, శివాలయం వీధి తదితర ప్రాంతాల మీదుగా ఆరాధానా భవన్‌కు చేరుకుంది. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ బోడోతరియా, ప్రధాన కార్యదర్శి పన్నాలాల్ జైన్‌లతో పాటుగా ఉపాధ్యక్షులు అశోక్ జైన్, జయంతిలాల్ జైన్, సహాయక కార్యదర్శి భోగిలాల్ జైన్, కోశాధికారి దుంగరమల్ జైన్, సహా కోశాధికారి రాహుల్ జైన్ తదితరులు పర్యవేక్షించారు.